

విజయీభవ..

- ఒత్తిడికి గురి కావద్దు..
- పరీక్షలు బాధ్యతగా రాయాలి, భయంతో కాదు..
- 'పది' అత్యంత కీలకం
- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు



పీలేరులో పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో-1 లోకేశ్వర్ రెడ్డి

పీలేరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైనది. పదో తరగతి మార్కులు జీవితాంతం అక్కరకు వస్తూనే ఉంటాయి. విద్యార్థి దశలో వాటి విలువ తెలియకపోయినా తదనంతర జీవితంలో తెలిసి వస్తుంది. చదువుకున్న ప్రతి ఒక్కళ్లూ జీవితంలో వెనక్కు వెళ్లి పదో తరగతి మరోమారు చదివే అవకాశం వచ్చి, మంచి మార్కులు సాధించే అవకాశం వస్తే బాగుండు అని అనుకోని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అటువంటి కీలకమైన పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పబ్లిక్ పరీక్షలని, జీవితానికి ఉపయోగపడే పరీక్షలని, టెన్త్‌లో మంచి మార్కులు వస్తేనే ఇంటర్ చదివేందుకు మంచి కాలేజీలో అడ్మిషన్ దొరుకుతుందని...ఇలా రకరకాల మాటలతో విద్యార్థులు ఒత్తిడికి లోనవడం సహజం. ఆ ఒత్తిడిని జయిస్తేనే 'పది'లంగా బయటగలమని, పరీక్షలు రాసేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని పీలేరు ఎంఈవో లోకేశ్వర రెడ్డి చెబుతున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో, విజయాన్ని అలవోకగా ఎలా కైవసం చేసుకోవాలో ఆయన వివరించారు.

విద్యార్థులు చేయకూడనివి..

- పరీక్షలకు విద్యార్థులు సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్‌వాచ్ ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు.
- పరీక్ష కేంద్రంలో తమ వద్ద ఆన్సర్ షీటు తప్ప ఇతరత్రా పేపర్లు పెట్టుకోకూడదు.
- తమకిచ్చిన ఆన్సర్ షీట్‌ను పరీక్ష కేంద్రం బయటకు తేకూడదు.

పరీక్షకు ముందు..

- పరీక్ష సామగ్రి (పెన్నులు, రీఫిల్స్, పెన్సిల్, రబ్బరు, షార్ప్‌నర్, స్కేల్, తదితరాలు), హాల్‌టికెట్‌ను ముందు రోజు రాత్రే సిద్ధంగా పెట్టుకోవాలి. చివరి నిమిషంలో వాటి కోసం వెతుక్కునే పరిస్థితి రాకూడదు.
- మంచి నీళ్ల సీసాను వెంట తీసుకెళ్లడం మంచిది. ఒకవేళ పరీక్షా కేంద్రంలోకి అనుమతించకపోతే బయట వదిలేయవచ్చు. అనుమతిస్తే మంచిది. కొన్ని చోట్ల నీరు సరైనది కాకపోతే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంటుంది.
- సాయంత్రం లేదా రాత్రి పూట త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. మసాలాలతో కూడిన ఆహారం వల్ల నిద్ర సరిగ్గా ఉండదు.
- పరీక్షకు వెళ్లేటప్పుడు కూడా పోషకాహారం తీసుకోవాలి. నూనెతో చేసిన పదార్థాలు తీసుకోకూడదు. వాటి వల్ల దాహం ఎక్కువై పదేపదే నీరు తాగాల్సి రావచ్చు.
- పరీక్ష హాలుకు నిర్దేశిత సమయానికన్నా అరగంట ముందు చేరుకోవాలి. మార్గమధ్యంలోని ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఇంటి నుంచి ముందుగానే బయలుదేరాలి.
- పరీక్షా కేంద్రం, పరీక్షా హాలులోకి వెళుతూ కూడా చదవడం మంచిది కాదు. అలా చదివింది గుర్తు కూడా ఉండదు. ఏదైనా గుర్తు రాకపోతే పట్టించుకోకుండా వదిలేయాలి తప్ప ఆందోళన పడకూడదు.

పరీక్ష హాలులో..

- ప్రశ్నపత్రం చేతిలోకి తీసుకున్న వెంటనే గుండెల నిండా ఊపిరి పీల్చుకుని దానిని ఆసాంతం బాగా చదవాలి.
- మొదటి పది నిమిషాలు ప్రశ్నలు చదవడానికి, అవసరమైన ప్రశ్నలకు చుక్కలు పెట్టుకోవడానికి కేటాయించాలి.
- చివరి పది నిమిషాలు పేపర్ అంతా ఒకసారి చూసుకోవడానికి కేటాయించాలి.
- మొదట రాసే ప్రశ్నలకు ఎక్కువ సమయాన్ని కేటాయించకూడదు. మిగతా ప్రశ్నలకు సరైన సమయం ఉంటుందో లేదో చూసుకోవాలి.
- మొదట బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- చివరి ప్రశ్న కూడా కాస్త బాగా తెలిసినదే రాయాలి. చివరిలో వచ్చీ రాని నానిరకం ప్రశ్నను ఎంచుకోకూడదు.
- సమాధానాలను రాసేటప్పుడు పెద్ద పేరాగ్రాఫ్‌లా కాకుండా పాయింట్‌ల రూపంలో రాయాలి.
- హెడ్డింగ్స్, సబ్‌హెడ్డింగ్స్ పెట్టడం వలన పేపర్‌లు దిద్దే వారికి సులభంగా ఉంటుంది.
- ప్రశ్న అడిగిన విధానాన్ని బట్టి సమాధానం ఉండాలి. ఉదాహరణకు పోల్చి చూడండి అంటే పట్టిక రూపంలో సమాధానం రాయాలి. వర్ణించుము అంటే పేరాగ్రాఫ్‌గా రాయాలి. లెక్కించుము అంటే పాయింట్‌ల వారీగా రాయడం మంచిది.
- సమాధారం రాసిన వెంటనే కాస్త దూరంలో గీత గీసి మరో సమాధానం రాయాలి.
- ప్రశ్నపత్రం కష్టంగా ఉందని అనిపిస్తే ఎంతో కొంత గుర్తుకొచ్చింది రాయాలే తప్ప ప్రశ్నలను వదిలేయకూడదు.
- పేపరు సులభంగా ఉంటే మంచి విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు సులభంగా ఉన్న వాటి కంటే ఇతరులు రాయలేరు అన్న ప్రశ్నలకు సమాధానాలు రాయడం వల్ల పేపరు దిద్దేవారికి కాస్త ఆసక్తి కలుగుతుంది. లేదంటే బాగా చదివిన వారికి, చదవని వారికి ఒకే రకంగా మార్కులు వచ్చే అవకాశాలు ఎక్కువ.
- పేజీలను నింపేందుకు అనవసర విషయాలను రాయకూడదు.
- అనుకున్నవన్నీ రాసేసిన తరువాత సమయం ఉందని అనిపిస్తే ఛాయిస్ ప్రశ్నలకు కూడా సమాధానాలు రాయాలి.
- పరీక్ష హాలులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సరే తట్టుకోవాలి.
- పరీక్ష అయిపోయిన తర్వాత దాని గురించి ఎవరితోనూ చర్చించకూడదు. ఫలానా ప్రశ్నకు సరిగ్గా రాయలేకపోయానని చింతించకూడదు. తరువాత పరీక్షపై దృష్టి సారించాలి.

పిల్లలు ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాలి

పది పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పిల్లలు ఒత్తిడికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పరీక్షలు జరిగినంత కాలం తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి. ఇంత కాలం చదివించిన ఉపాధ్యాయులు సైతం పిల్లలకు పరీక్షలు రాయాల్సిన సులువైన పద్ధతులను వివరించాలి. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉంటే తప్పనిసరిగా మంచి మార్కులు సాధిస్తారు.

- లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈవో-1, పీలేరు

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి..



పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా, పరీక్షలు రాయాలి. ప్రతి మండలానికి ఒక 104 వాహనాన్ని అందుబాటులో ఉంచుతాము. విద్యార్థులు సమయానికి పరీక్షకు హాజరయ్యేందుకు ఉచిత ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశాము. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలి.

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి..



జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన కోసం కృషి చేస్తున్నాము. జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థుల కోసం 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాము. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బెంచ్‌లతో పాటు ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచుతున్నాము. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలి. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేసి ఉంచాలి. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షను ప్రశాంత వాతావరణంలో రాయాలి.

- సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి

పరీక్షలు ప్రశాంతంగా రాయండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి (కలెక్టరేట్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారులూ... 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా జిల్లాలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు స్ఫూర్తిని కల్పిస్తూ మంగళవారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. పరీక్షలు బాగా రాయాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటూ మీ అందరికీ నా ఆశీస్సులు అంటూ తెలియజేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావడానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, వేసవి దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమయ్యే మందులు ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

పది పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

- 121 పరీక్షా కేంద్రాల్లో 22,355 మంది విద్యార్థులు
- 8 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు

రాయచోటిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 121 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి పదో తరగతి పరీక్షకు హాజరుకానున్న 22,355 మంది విద్యార్థులకు అన్ని ఏర్పాట్లను విద్యాశాఖాధికారులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 121 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు అత్యంత పకడ్బందీగా నిఘా నీడన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే అధికారులు జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాలను పరిశీలించి అక్కడ విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేశారు. 8 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించిన అధికారులు, అక్కడ ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు, అక్రమాలకు తావు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశా రు. 121 పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న 121 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 11 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 25 సిట్టింగ్స్ స్క్వాడ్‌లతో పాటు 1250 మంది ఇన్విజిలేటర్లకు శిక్షణ పూర్తి చేసి పరీక్ష నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. రాయచోటి పట్టణంలోని డీఈవో కార్యాలయంలో పదవ తరగతి పరీక్షల రాష్ట్ర అబ్జర్వర్ ఉమ్మడి కడప జిల్లా అడిషినల్ డైరెక్టర్ మధుసూదన్‌రావు ఆదివారం సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు తదితర సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు.



ప్రశ్నపత్రాలను భద్రపరిచిన జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం వద్ద పహారా కాస్తున్న పోలీసు

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు



పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జిల్లా రెవెన్యూ అధికారి మదుసూదన్‌రావు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగమూర్తి, భాషా సంయుక్త రాష్ట్రాల కోసం పోరాటం చేసిన ఆద్యుడని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవియైన మహాపురుషుడన్నారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ తదితర ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడన్నారు. ఇటువంటి మహనీయుల జీవితం నుంచి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో దేశభక్తితో మెలగాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రెడ్డెప్పరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
రాయచోటి	6.30	5.01
మదనపల్లె	6.31	5.08
రాజంపేట	6.28	5.09
పీలేరు	6.29	4.59

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 17వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో రద్దు : ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో ఎస్పీ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారని, వారికి ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీసు అధికారులు పరీక్షల బందోబస్తులో నిమగ్నమై ఉంటారని, కావున ఫిర్యాదుదారులు ఇబ్బంది పడకుండా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేశామన్నారు. కావున అర్జీదారులు పోలీసు కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావొద్దని తెలిపారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న పెద్దిరెడ్డి

- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాయచోటిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసమే పెద్దిరెడ్డి కుటుంబం హత్యా రాజకీయాలకు పాల్పడుతోందని, పుంగనూరులో టీడీపీ సీనియర్ కార్యకర్త రామకృష్ణ హత్య ఘటన దారుణమని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన రాయచోటిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో మద్యం పాలసీని ప్రశ్నించిన దళిత యువకుడిని హత్య చేసిన పాపం పెద్దిరెడ్డి కుటుంబానికే దక్కిందన్నారు. చిత్తూరు జిల్లాలో పాడి రైతుల పట్ల కూడా అమానుషంగా వ్యవహరించారన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్తలు పుంగనూరు మీదుగా సైకిల్ యాత్ర చేస్తుంటే వారి పట్ల పాశవికంగా వ్యవహరించడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పెద్దిరెడ్డి ఆగడాలను పుంగనూరులో అడ్డుకున్నందుకే రామకృష్ణను హతమార్చారన్నారు. రామకృష్ణను చంపిన హంతకులు, వారి వెనుక ఉన్న వైసీపీ నేతలను ప్రభుత్వం వదలదన్నారు. పోలీసులు ఇంకా వైసీపీ మాయలోనే ఉన్నారని, విధుల్లో అలసత్వం వహించి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరించే పోలీసుల వైఖరి మార్చుకోవాలన్నారు. హత్యకు గురైన రామకృష్ణ కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుని అండగా ఉంటుందని తెలిపారు. పెద్దిరెడ్డి కుటుంబం ఇకనైనా హత్యా రాజకీయాలు మానుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్‌హుస్సేన్, వీరబల్లి మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, టీడీపీ నేత నేతి రాంమోహన్ పాల్గొన్నారు.

బెట్టింగ్ కేసులో


వైసీపీ నాయకుడు అరెస్టు

- రూ. 1.20 లక్షల నగదు , ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం

7

పట్టపగలే భారీ చోరీ

- 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ



7

పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఘనంగా సీపీఐ శత వసంతాల వేడుకలు

బి.కొత్తకోట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పన్నులతో పేదలను కొట్టి పెద్దలకు వేస్తోందని, హిందూత్వ అజెండాతో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ దుయ్యబట్టారు. బి.కొత్తకోట పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎర్రజెండాలు, తోరణాలు, కంపవాలు, ఫ్లెక్సీలతో సభావేదికైన జ్యోతిసర్కిల్ ఎరుపెక్కింది. సర్కిల్‌లో పార్టీ పతాకాన్ని నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బళ్లారి డ్రమ్స్, లంబాడీల సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పట్టణంలోని దిగువబస్టాండ్, బైపాస్ రోడ్డు, రంగసముద్రం రోడ్డుల మీదుగా ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం పేదలకు సెంటు భూమి ఇచ్చింది లేదన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పవన్ చదివిన స్క్రిప్టు బీజేపీ పెద్దలు రాయించిందేనని సనాతనధర్మం గురించి పూర్తి అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నాన్నారు. రాష్ట్రంలో భూములు పోగొట్టుకుని అన్యాయమైపోతున్న వారిపైనే కేసులు నమోదవుతున్నాయని, కబ్జాదారులు దర్జాగా తిరుగుతున్నారన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఐదేళ్లు నియంతృత్వ పాలన సాగించి ప్రజాగ్రహంలో 11 సీట్లకు పరిమితమై ప్రతిపక్ష హోదా కావాలంటూ చిన్నపిల్లాడి చేష్టలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలపై మాట్లాడకపోవడం సరికాదని తప్పుపట్టారు. సీపీఐ గెలవకపోయినా ప్రజల కోసం పోరాటాలు చేస్తూనే ఉందని, జిల్లాలో ఎందరో పేదలకు బాసటగా నిలిచామన్నారు. పోరాటాలు చేస్తున్న స్థానిక నేతలను అభినందించారు. నిలబడదాం..పోరాడదాం..సాధిద్దాం అనే సిద్ధాంతంతో సీపీఐ ముందుకు పోతుందని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథరెడ్డి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, ప్రజానాట్యమండలి పెంచలయ్య, జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, నియోజకవర్గ నాయకుడు క్రిష్ణప్ప, మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, రఘునాథ్, తదితరులు మాట్లాడారు.





బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ... సమావేశానికి హాజరైన జనం

ప్రజల సమస్యలు పట్టవా.. జగన్ !

- ప్రతిపక్ష హోదా రాదని తెలిసినా.. అసెంబ్లీకి వెళ్లవు
- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ గెలిచిన 11 సీట్లతో అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూడా.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని సాకులు చెబుతూ అసెంబ్లీకి వెళ్లవు.. ప్రజల సమస్యలపై చర్చించవు.. కనీసం పులివెందులలో సమస్యల గురించి పట్టించుకోవు.. అంటూ మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. 60వేల మెజార్టీతో ప్రజలు గెలిపిస్తే సమస్యలు పట్టించుకోనప్పుడు ఆ పదవిలో కొనసాగడం ఎందుకని, రాజీనామా చేస్తే వేరొకరికి అవకాశం వస్తుందన్నారు. వేంపల్లె ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగానే అసెంబ్లీకి వెళ్లకుండా.. చిన్నపిల్లాడిలా ప్రతిపక్ష హోదా కోసం పట్టుబడుతున్నారని ఎద్దేవా చేశారు. పులివెందులలో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు తదితర ఎన్నో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతురన్నారని.. వాటిపై ఎమ్మెల్యేగా అడగాల్సిన బాధ్యత లేదా అని మండిపడ్డారు. ఇక వేంపల్లెలో అవినీతి ఆరోపణలతో ఈఓ సస్పెండ్ కావడంతో పారిశుధ్యం, నీటి సమస్య గురించి పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జీవీ రమణ, భాస్కర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమేష్, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు అరెస్టు

● రూ. 1,20,000 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం


క్రికెట్ బుకీల అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ ఎస్‌ఐలు

ప్రొద్దుటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు రావలకొల్లు నాగేంద్రను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, నంజీవరెడ్డి అరెస్టయిన నలుగురు క్రికెట్ బుకీల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చాంపియన్‌షిప్ ట్రోఫీ సందర్భంగా ఎర్రగుంట్ల రోడ్డు లోని పాలకేంద్ర సెక్యూరిటీ రూం దగ్గర నలుగురు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ లావాదేవీలు నిర్వహిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ. 120,000 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో ప్రొద్దుటూరు పట్టణం శ్రీరాం నగర్‌కు చెందిన రావులకొల్లునాగేంద్ర (42), వివేకా నంద కాలనీకి చెందిన గాలిపోతుల ఆనంద్ (21), శ్రీరాంనగర్‌కు చెందిన రావులకొల్లు మనోజ్ (23), శ్రీరాంనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బొమిశెట్టి శివప్రసాద్ (28) ఉన్నారని తెలిపారు. వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోవా మద్యం పట్టివేత


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, మద్యం

ప్రొద్దుటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇతర ప్రాంతాలనుంచి ప్రొద్దుటూరుకు కారులో గోవా మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వర రెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డిలు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా కాటం వీరేంద్ర ఉప్పు రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు కారులో 18 (750ఎంఎల్) గోవా మద్యం ఫుల్ బాటిళ్లను తీసుకోని వస్తుండగా పట్టుబడ్డారు. గోవా మద్యంతోపాటు కారును స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పట్టపగలే భారీ చోరీ

● 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ


ధ్వంసమైన బీరువా, చెల్లాచెదురుగా దుస్తులు

గుర్రంకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన ఓ కుటుంబం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహరించుకు వెళ్లారు. బాధితుల కథనం మేరకు మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ నూరప్ప గారి పల్లెకు చెందిన మునిస్వామి, గంగులమ్మ దంపతులకు వ్యవసాయం జీవనాధారం. వీరి ఇల్లు గ్రామంలో చివరన ఉంది. ఆదివారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లిన వారు సాయంకాలం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి ముఖ ద్వారం తెరచి ఉండడంతో, లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసమై, అందులోని దుస్తులు ఇతర సామగ్రి చెల్లాచెదురుగా కింద పడి ఉండడం కనిపించింది. బీరువాలోని లాకర్‌ను పరిశీలించా అందులోని నగలు, బంగారం అపహరణకు గురైనట్లు తేలింది. 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదును దుండగులు అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి


వెంకటరమణ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్/రామసముద్రం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు చౌడేపల్లె ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. మదనపల్లెలో ఉంటూ మండలంలోని చీకలబైలు హైస్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న వెంకటరమణ(55) ఆదివారం చౌడేపల్లెలో తమ బంధువుల గృహ ప్రవేశానికి వెళు తుండగా చిత్తూరు జిల్లా బోయకొండ రోడ్డులో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన పడిపోయడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడిని స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించార చౌడేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య


ఉరి వేసుకున్న లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలోని హైపర్‌టెన్షన్ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లాలోని దొనగిరి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(35) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం రైల్వేకోడూరు మండలం కే. బుడుగుంటపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ని విద్యానగర్‌కు వచ్చాడు. వివిధ రకాల కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమని తెలిసింది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేణిగుంట రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు


చికిత్స పొందుతున్న మౌలాలి

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. బికొత్తకోట మండలం, గోళ్లపల్లె గ్రామం, కనికలతోపునకు చెందిన షేక్ మౌలాలి(35) న్యూస్ పేపర్ బాయ్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం ఉదయం రోడ్డు పక్కన వెళు తున్న అతను కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు బి.కొత్తకోట పోలీసులు తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బాలికల గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుగుణమ్మ తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకుంటే ప్రవేశపరీక్ష ఉంటుందని, ప్రతిభ ఉన్న వారికి సీట్లు లభిస్తాయని తెలిపారు. ఈనెల ఆఖరులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

కేసీ కెనాల్ కింద రెండు కార్లు పండిస్తాం

● ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



ఎర్రచెరువుకు తెలుగుగంగ నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా (ఇన్‌సర్ట్) ఎర్రచెరువు వైపు ప్రవహిస్తున్న జలం

మైదుకూరు రూరల్, మార్చి16(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో రెండు కార్ల సాగుకు నీటిని అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలో వనిపెంట వద్ద నున్న ఎస్ఆర్ 2 నుంచి మైదుకూరు ఎర్రచెరువుకు ఆదివారంనీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన పుట్టా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంవత్సరంలో రెండు సార్లు చెరువులకు నీరు విడుదల చేశామన్నారు. శెట్టివారిపల్లె చరిత్రలో ఏ ఏడాదిలోనూ చెరువు నిండలేదని, కానీ కూటమి ప్రభుత్వంలో రెండు సార్లు చెరువును నింపామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జలాశయంలో నీరు ఉన్నా వదలకుండా పొలాలను ఎండగట్టారని, నేడు మైదుకూరు మున్సిపాలిటీలో నీరు పుష్కలంగా ఉందని ప్రజలు గుర్తించాలని తెలిపారు.

రెండుకార్ల సాగుకు కార్యాచరణ

రాజోలి ఆనకట్ట నిర్మాణానికి సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారని, అయితే, నిధుల కొరత వల్ల కొద్దిగా జాప్యం జరగవచ్చునని తెలిపారు. అలగనూరు జలాశయాన్ని 3 టీఎంసీల నీటితో నింపడానికి రూ. 36 కోట్లు అవసరం అవుతుందన్నారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చ కూడా జరిగిందని, నిధుల మంజూరుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అలగనూరు జలాశయంలో మూడు టీఎంసీల నీరు నింపితే, ఏప్రిల్, మే, జూన్ నెలలో నీటిని వాడుకోవచ్చని, తద్వారా రెండు కార్లు పండించుకోవడమే కాకుండా తాగునీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్యే పుట్టా తెలిపారు.

మైదుకూరుకు నవోదయ విద్యాలయం మంజూరు

మైదుకూరు నియోజకవర్గానికి నవోదయ విద్యాలయం కావాలని గత ఏడాది సెప్టెంబరు నెలలో మంత్రి నారా లోకేశ్‌ను కోరగా ఆయన మంజూరు చేశారని, అందుకు సంబంధించిన పత్రాలను విలేకరులకు చూపించారు. నియోజకవర్గంలోని బ్రహ్మంగారిమఠంలో సుమారు 30 ఎకరాలలో ఈ పాఠశాలను నిర్మిస్తారని తెలిపారు. రాష్ట్రంలో నవోదయ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులందరూ మైదుకూరులోని బ్రహ్మంగారిమఠంలోని నవోదయ పాఠశాల గురించి మాట్లాడుకుంటారని తెలిపారు. నవోదయ పాఠశాలతో నాణ్యమైన విద్యతో పాటు మైదుకూరుకు మంచిపేరు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దానరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు భీమయ్య, ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, గుండం రాజు సుబ్బయ్య, ఇస్మాయిల్, కటారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప నాగరాజుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా డీడీయు-జీకేవై పథకం కింద సీడాప్ సౌజన్యంతో 18-32 ఏళ్ల లోపు గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీ థెరపీవంటి కోర్సుల్లో నాలుగు నెలల శిక్షణ, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నామన్నారు. ఈ శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు, ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని, మరిన్ని వివరాలకు 9063082227 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు గ్రీవెన్స్ సెల్

కడప కలెక్టరేట్ మార్చి 16(ఆంధ్రజ్యోతి) ప్రతి సోమవారం ఉదయం 9-30గంటల నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్‌తో పాటు, కలెక్టరేట్ సభా భవన్‌లో పిర్యాదులను స్వీకరించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపాలిటీల స్థాయిలోనిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్


సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

కడప సెవెన్ రోడ్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్న మోదీకి ప్రజా ప్రతిఘటన తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం కడప ఆర్‌కే నగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సీపీఎం కడప జిల్లా కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేయడం సీపీఎం భవిష్యత్ కార్యాచరణ అన్నారు. భవిష్యత్తులో దేశంలో, రాష్ట్రంలో జరిగే ఎటువంటి ఎన్నికలలోనైనా సీపీఎం పొత్తులు స్థానిక పరిస్థితుల ఆధారంగా ఉంటాయన్నారు. 2025 ఏప్రిల్ 2వ నుంచి 6వ తేదీ వరకు తమిళనాడులోని మధురైలో నిర్వహించనున్న 24వ సీపీఎం జాతీయ మహాసభల్లో స్పష్టమైన రాజకీయ విధానం రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ, మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



వెంకటరమణ, శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కడప నగరం స్వేచ్ఛ సమావేశ మందిరంలో ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా రాజంపేట గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సంబావు వెంకట రమణ, కార్యదర్శిగా ముద్దనూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడుగా నాగేశ్వరరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా ఆలీ అక్బర్, సంయుక్త కార్యదర్శిగా ఎన్. సంజీవరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి మిగిలిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.వెంకటరెడ్డి మాజీ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పెంచలయ్య, రాజగోపాల్‌రెడ్డి, పోలా రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పి.సురేష్, విజయ్ కుమార్, మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సంజీవ రెడ్డి, నరసింహులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు హాజరయ్యారు.

మేమున్నాం.. ఆందోళన విరమించండి

● విద్యార్థులకు ఏపీ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ లక్షుమయ్య సూచన


దీక్షా శిబిరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ లక్షుమయ్య

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పశువైద్య కళాశాల విద్యార్థుల ఉపకార వేతనాలపై ప్రభుత్వంతో మేము పోరాడుతాం. మీరు ఆందోళన విరమించండి అని ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ లక్షుమయ్య (ఐఏఎస్) సూచించారు. ఆదివారం ఆయన ఫోరం ఆఫ్ రిజిస్టార్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డితో కలిసి పశువైద్య కళాశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అతి త్వరలో ఇంటర్న్‌షిప్‌లో అందించే ఉపకార వేతనాల మొత్తం పెంచుతూ ప్రభుత్వం జీవో తీసుకురానుంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తరఫున తాము పోరాడుతామని, విద్యార్థులు ఆందోళన విరమించి తరగతులకు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న గరివిడి, గన్నవరం, తిరుపతి వెటర్నరీ కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడి అందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుంటామని విద్యార్థి నాయకులు చెప్పారు. దీంతో లక్షుమయ్య విజయవాడకు బయలుదేరగా, విద్యార్థులు వారి ఆందోళనను కొనసాగిస్తూ, ఇతర కళాశాలలోని విద్యార్థులతో సంప్రదింపులు చేస్తున్నారు.

ముగిసిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

● కడప బాలురు, శ్రీకాకుళం బాలికల విజయఢంకా


పులివెందులలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న కడప, ప్రకాశం జట్లు

పులివెందుల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు రోజుల పాటు జరిగిన 34వ అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పులివెందుల లోని వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరిగిన ఈ పోటీల్లో 13జిల్లాల బాల, బాలికల జట్లు తలపడ్డాయి. చివరి ఫైనల్ మ్యాచ్‌లు ఆదివారం నిర్వహించగా కడప వర్సెస్ ప్రకాశం జట్ల మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో కడప బాలుర జట్టు విజయఢంకా మోగించింది. అలాగే శ్రీకాకుళం-అనంతపురం మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం బాలికల జట్టు విజయఢంకా మోగించింది. విజేతలకు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, కడప జిల్లా అసోసియేషన్ ప్రతినిధుల చేతులమీదుగా కప్‌లు అందించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ట్రెజరర్, కొండయ్య, కోచ్ శ్రీధర్‌లు పాల్గొన్నారు. మొట్టమొదటి సారిగా పులివెందులలో అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలు విజయవంతం అయిన సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

వేడుకగా కనుమలో గంగమ్మ తిరునాళ్లు




ప్రత్యేకాలంకరణలో కనుమలో గంగమ్మ, బోనాలు తీసుకొస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ ఆలయంలో ఆదివారం పగలు తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి వెంకరటమణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు చీర, జాకెట్లు, కుంకుమ. పసుపు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లు కట్టి, కోర్కెలను తీర్చాలని కోరారు. సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. మధ్యాహ్నం గుత్తా హరికృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

హిందువుల్లో ఐకమత్యంతో సత్ఫలితాలు

● సమావేశంలో ఆర్‌ఎస్ఎస్ ప్రతినిధుల సూచన


సింహాద్రిపురం వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న స్వయంసేవకులు

సింహాద్రిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో హిందువులంతా ఏకమైతేనే ఫలితం ఉంటుందని సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, ముఖ్య అతిధి వెంకటనాథరెడ్డి, ప్రధాన వక్త పుట్టాశేషు అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం 99 ఏళ్ల పూర్తి చేసుకుని శతవసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం సాయంత్రం సింహాద్రిపురంలోని జన్ను నారాయణరెడ్డి ఆయిల్ మిల్ నుంచి పుర వీధుల గుండా స్వయం సేవకులు, హిందువులు కవాతు నిర్వహించారు. అంతకంటే ముందు పులివెందుల నుంచి సింహాద్రిపురం వరకు హిందువులు బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల వెంబడి మహిళలు పూలు చల్లి స్వయం సేవకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వక్తలు సమావేశంలో మాట్లాడుతూ స్వయంసేవకులు ఎప్పుడూ క్రమశిక్షణతో దేశం కోసం అంకిత భావంతో పనిచేస్తారన్నారు. సంఘ్ కార్యకర్తలు పర్యావరణ పరిరక్షణ, గోరక్షణ, దేవాలయాల రక్షణ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు కూడా పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అజ్జగుట్టు వెంకటనాథరెడ్డి, వంగల శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, విజయరామవరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

దారి విషయంలో రెండు వర్గాల వివాదం

● పోలీసుల ప్రమేయంతో సర్దుబాటు


ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ

పులివెందుల టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దారి విషయంలో పట్టణంలో రెండు మతవర్గాల మధ్య వివాదం నెలకొంది. స్థానిక జెండామాన్‌వీధిలో ఉన్న పోలేరమ్మ గుడి దగ్గర ఓ మతానికి చెందిన ప్రార్థనా మందిరం ఉంది. ఆ వర్గానికి చెందినవారు గుడి వైపు ఉన్న గోడను తొలగించి దారి ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు, స్థానికుల తో కలిసి వారిని ప్రశ్నించారు. దీంతో ఆ వర్గానికి చెందినవారు భారీగా గుమిగూడడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పట్టణ సీఐ నరసింహులు సంఘటనాస్థలానికి వెళ్లి ఇరు వర్గాలతో మాట్లాడి వివాదాన్ని సర్దుబాటు చేశారు. యథావిధిగా గోడను నిర్మిస్తేనే అక్కడి నుంచి వెళతామని బైఠాయించడంతో, ఆమేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నేడు గండిలో వివిధ హక్కుల వేలం

చక్రాయపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు పలు హక్కులకు సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలి పారు. ఇడుపులపాయ, నందిమండలం, వీరన్నగట్టుపల్లె, కుమ్మ రాంపల్లె, చక్రాయపేట తదితర ప్రాంతాలలో దేవస్థానానికి సంబంధించిన భూముల కౌలు హక్కులకు రూ.5వేలు దరావత్తు కట్టి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. గండి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లోని గదుల లీజుకు రూ.10వేలు, దేవస్థానం ఆవరణలో సులబ్‌కాంప్లెక్స్ నిర్వహణకు రూ.5 వేలు దరావత్తు కట్టి పాల్గొనాలి. దేవస్థానంలో నిత్యాన్నదానానికి కూరగాయలు సరఫరా చేసేందుకు రూ.20వేలు దరావత్తు కట్టి పాల్గొనాలి. దేవుడి నైవేద్యం కోసం పాలు, పెరుగు సరఫరాచేసేందుకు రూ.20వేలు దరావత్తు కట్టి పాల్గొనాలి. అలాగే ఖాళీ నెయ్యి డబ్బాలు, నిరుపయోగంగా ఉన్న వస్తువులు విక్రయించేందుకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న భక్తులు

సంబేపల్లె, మార్చి16(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం మోటకట్ల శివసాయి ఆలయంలో మహా కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆఖరి రోజైన ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, రాజరాజేశ్వరిదేవి, శ్రీచక్రం, అయ్యప్పస్వామి, సూర్యభగవానుడు, శనీశ్వరుడు, సుబ్రమణ్యంస్వామి, ద్వారపాలకులైన జయవిజయులు, ధ్వజస్తంభాలను మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. టీటీడీ వేదపండితులు ఆచార్య బ్రహ్మాచార్యుల పర్యవేక్షణలో శ్రీవైఖనసా ఆగమ శాస్త్రానుప్రకారం చేపట్టారు. కీర్తిశేషులు వీవీ సుబ్బారెడ్డి, కీర్తిశేషులు వాసుదేవమ్మల కుమారులు వెంకటనాథరెడ్డి,రామచంద్రారెడ్డి (శ్రీసిటీ డైరెక్టర్), అమర్‌నాథరెడ్డి, జగన్నాథరెడ్డి కార్యక్రమ నిర్వహణకు కృషి చేశారు.

ఆ ప్రాంతం.. మేడిపండు చందం


మరుగున పడిన చెత్త సేకరణ వాహనం

రైల్వేకోడూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'పైన పటారం లోన లొటారం.' అనేది మనం వింటూనే ఉంటాం. అది రైల్వేకోడూరు పంచాయతీకి అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. పట్టణంలోని గాంధీనగర్, డాక్టర్ గిరిజమ్మ వీధి, జగడంపల్లె, నరసారాంపేట, రంగనాయకులపేట, వసంతనగర్, చర్చి ప్రాంగణం, పోలీస్‌స్టేషన్ ముందు భాగం పరిశుభ్రంగా ఉంటాయి. కానీ లోపలకి వెళ్తే గాని తెలియదు అసలు రంగు. ముఖ్యంగా గాంధీనగర్, నరసారాంపేట, జగడంపల్లె వీధుల్లో నిత్యం సీసీ రోడ్లపై నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఇక వీధి చివర్లో చెత్త మామూలే. పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇస్తేకాని రారు. ఖాళీ ప్రాంతాలలో చెత్తాచెదారం, పందులు కనిపిస్తాయి. చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతులు చేయకుండా పంచాయతీ ఉపసర్పంచ్ తేట శివసాయి పక్కన పెడుతున్నారనే ఆరోపణలున్నాయి.


గాంధీనగర్‌లో మాజీ సర్పంచ్ ఇంటి వెనుక ఉన్న చెత్త

సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తా



మా కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు రూ.9 లక్షల వ్యయంతో రెండు చెత్త సేకరణ ఆటోలు, రూ.2.50 లక్షలతో రోడ్డు శుభ్రం చేసే యంత్రాలను పంచాయతీకి అందజేశాం. పంచాయతీ అధికారులు వాటిని మరుగున పడేశారు. నాసొంత నిధులతో మరమ్మతులు చేయిస్తా. అధికారుల అనుమతి కోసం వినతి పత్రం అందజేశా. - తేట శివసాయి, ఉపసర్పంచ్

మొత్తం శుభ్రం చేయాలి



అన్ని ప్రాంతాల్లో ఉన్న చెత్త పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలి. పంచాయతీ అధికారులకు సమాచారం ఇస్తే కాని రారు. చెత్తా చెదారాలను ఎక్కడికక్కడే పడేస్తుండడంతో దోమలు అధికమై జ్వరాలను వ్యాపింప జేస్తున్నాయి. పంచాయతీ కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలి. - పఠాన్ మౌల, గాంధీనగర్

వాహనాలకు మరమ్మతులు చేయించాం



చెత్త వాహనాలకు మరమ్మతులు చేయించాం. చెత్తను స్థానికులు వీధి చివర్లో పడేస్తున్నారు. రోజు శుభ్రం చేయిస్తూనే ఉన్నాం. చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజు వీధుల్లో ఉన్న చెత్తను సేకరిస్తున్నాయి. పందులు వీధుల్లో లే కుండా వాటి యజమానులు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. వీధుల్లో నీళ్లు వదులుతున్న వారికి నోటీసులు అందజేస్తాం. - ప్రసాద్, పంచాయతీ అధికారి

ఘనంగా ఉరుసు

సిద్దవటం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిద్దవటం కోటలో వెలసిన హజరత్ సయ్యద్ షా, బిస్మిల్లా షా ఖాద్రి దర్గాలో ఆదివారం ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు సజ్జాదే నషీన్ ముత్తవలీ సయ్యద్‌షా మగ్దూమ్‌పీర్ ఖాద్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతియేటా పవిత్ర రంజాన్ మాసంలో ఉరుసు మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రెచ్చిపోతున్న కబ్జాదారులు

సిద్దవటం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కబ్జాదారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. శాఖరాజుపల్లె రెవెన్యూ పరిధిలోని ఉప్పరపల్లెలో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఎక్సకవేటర్లతో చదును చేసి కబ్జాలకు ప్రయత్నిస్తున్నారు. సర్వేనంబరు 424, 424/2 సుమారు 30 సెంట్ల ప్రభుత్వ స్థలంలో ఆదివారం ఆక్రమణకు యత్నించారు. రెవెన్యూ అధికారులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వీఆర్‌ఏ తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత

రైల్వేకోడూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అనంతరాజుపేట ఎంపీటీసీ సభ్యుడు బండారు మల్లికార్జున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. గిరిజన విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ హాల్‌టిక్కెట్లు అందజేశారు. అనంతరాజుపేట సర్పంచ్ కుసెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'అధైర్యపడవద్దు.. అండగా ఉంటా'


బీగాల వాసు తల్లిని ఓదార్చుతున్న అతికారి కృష్ణ

సిద్దవటం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : 'అధైర్యపడవద్దు.. అండగా ఉంటా'నని రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ భరోసా ఇచ్చారు. జనసేన క్రియాశీలక కార్యకర్త బీగాల వాసు కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. వారికి మనోధైర్యం ఇచ్చారు. అధైర్యపడవద్దు.. కన్నకొడుకులా తోడుంటానన్నారు.

'హతమార్చేందుకు యత్నిస్తున్నారు రక్షణ కల్పించండి'

సిద్దవటం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : హతమార్చేందుకు యత్నిస్తున్నారు. రక్షణ కల్పించండని కడపాయపల్లెకు చెందిన బత్తల శివకుమార్ కడప డీఎస్పీ, ఆర్డీవోలకు పిర్యాదు చేశారు. మండల కేంద్రమైన సిద్దవటంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తనకు, బొంత రమాదేవిలకు 2002లో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా సర్వే నంబరు 164 లింగంపల్లె రెవెన్యూ గ్రామ పొలంలో పట్టా పొందామన్నారు. అందులో ఈనెల 14న ఎక్సకవేటర్‌తో పని చేయిస్తుండగా రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి వెళ్లారన్నారు. కాగా ఒక వ్యక్తి తనను ఫోన్‌ద్వారా అడగకుండా భూమి సాగుచేయడం నీకు ఎంత ధైర్యం అని బెదిరింపులకు పాల్పడ్డాడన్నారు. అక్కడికి కొందరికి పంపించి పనిని నిలుపుదల చేశారన్నారు. కావున తనకు న్యాయం చేయాలని కోరారు.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

రాజంపేట టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు సమస్యలు కలిగినప్పుడు కార్మికులకు బోర్డు ఆసరాగా ఉంటుందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని పీఏఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నేతలు రమణ, పెంచలయ్య, వెంకటేశు, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన పాలేటమ్మ జాతర



చిన్నమండెం, మార్చి16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలోని దేవళంపేటలో వెలిసిన శ్రీపాలేటమ్మ జాతర సందర్భంగా వివధ జిల్లాల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు వస్తారని అంచనాలతో నలుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలతో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర



పెనగలూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అనంతంపల్లె గంగమ్మతల్లి జాతరను వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రముఖులు, రాజకీయ పార్టీ నాయకులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పేరం కృష్ణయ్యనాయుడు, నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసరెడ్డి, కొప్పోలు విజయభాస్కర్ రెడ్డి, ఊటుకూరు పాలిరెడ్డి పూజలు చేశారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

గాలివీడు, మార్చి16(ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గాలివీడు మండలం అరవీడు గ్రామం కూర్మయగారిపల్లెలో రూ.11.80 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. అరవీడు రెడ్డివారిపల్లె నుంచి కసిరెడ్డిగారిపల్లె వరకు రూ.40 లక్షలతో సిమెంటు రోడ్డును అధికారులతో కలిసి పరిశీలించారు.

శబ్ద కాలుష్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

రాజంపేట టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : శబ్ద కాలుష్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ స్పీచ్ థెరపిస్టు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆది సొసైటీ ఫర్ అప్లిఫ్మెంట్ ఆఫ్ రూరల్ ఎకనామి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వినికిడి పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెవిలో హెడ్‌ఫోన్స్ వాడడం వల్ల కూడా వినికిడి సమస్యలు అధికమవుతున్నాయన్నారు.వంద మందికి పైగా వినికిడి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 18 మందికి ఉచితంగా వినికిడి యంత్రాలను అందించారు. రాజంపేట పట్టణం ఆర్ఎస్ రోడ్డులోని రత్న స్పీచ్ థెరపీ అండ్ హియరింగ్ థెరపిస్టులు అందుబాటులో ఉంటారన్నారు. స్పీచ్ థెరపిస్టు బాబురావు, సైకాలజిస్టు ప్రవల్లిక పాల్గొన్నారు.

వైభవంగా పొంగళ్లు


పొంగుబాళ్లు పెడుతున్న మహిళలు

పుల్లంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామసముద్రం పంచాయతీ చెన్నమాంబపురం గ్రామంలో వెలసిన శ్రీ గంగాలమ్మ, సత్యమ్మ, ఆ మ్మవార్లకు మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగుబాళ్లు పెట్టారు. ఉదయం అమ్మ వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పొంగుబాళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అమరజీవిని గౌరవించుకోవడం మన బాధ్యత


రాయచోటి: నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి


రైల్వేకోడూరు: నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

రాయచోటిటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పేర్కొన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘననివాళులర్పించారు. ఏఆర్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌లు వీజే రామక్రిష్ణ, పెద్దయ్య, ఆర్ఎస్ఐలు అమర్‌నాధరెడ్డి, రవి, చంద్రశేఖర్‌లు, పోలీసు సిబ్బంది పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

రైల్వేకోడూరు: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం రైల్వేకోడూరులో జనసేన యువ నాయకుడు దాసరి వీరేంద్ర ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు ముత్యాల కిశోర్, వరికూటి నాగరాజు, అమర్, రామసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, నగిరిపాటి మహేష్ పాల్గొన్నారు.


కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

రామాపురం, మార్చి16(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తారని రాయచోటి నియోజకవర్గ ఐటీడీపీ చాంపియన్ నాగభూషణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో ఆదివారం బూత్ నెంబర్ 40, 41లో పార్టీ సభ్యత్వం పొందిన 600 మంది కార్యకర్తలకు సభ్యత్వం కార్డులు పంపిణీ చేశారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే ఐదు లక్షల బీమా కల్పించే ఏకైక పార్టీ టీడీపీ అన్నారు.

వెంకన్న ఆశీస్సులు అందరికీ అందాలి

రాయచోటిటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు ఆకాంక్షించారు. ఆదివారం ఆయన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ సుగవాసి జానకీరామ్ ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంచారు. అనంతరం ఆలయ పూజారి ప్రసాద్‌బాబు శాలువా, పట్టువస్త్రాలతో సన్మానం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి నగరిపాడు రంగనాయకులస్వామి బ్రహ్మోత్సవాలు


రంగనాయక స్వామి మూలవిరాట్

రాజంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నగరిపాడు రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి జరుగుతాయని రంగనాయకస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పోలిన నాగేశ్వరరావు, వైస్ ఛైర్మన్ శంకరయ్య ఉపాధ్యక్షుడు బచ్చు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఈనెల 27వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. 17వ తేదీ గొల్లపల్లె, తోపురేపల్లె గ్రామస్థులచే ప్రత్యేక పౌరాణిక నాటకాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18న పెద్దూరు గ్రామస్థులచే అన్నదానం, పౌరాణిక నాటకం ఉంటుందన్నారు. 19న వెంకటరాజుపల్లె గ్రామస్థులచే బాలనాగమ్మ పౌరాణిక నాటకం ప్రదర్శిస్తారన్నారు. 20న ఎగువపల్లె గ్రామస్థులచే సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21న రంగనాయకస్వామి అగ్నిప్రవేశం రోజు బ్రహ్మంగారు రచించిన పవిత్ర కాలజ్ఞాన కాలపత్ర గ్రంధాలను ప్రదర్శిస్తారన్నారు. ఆదేరోజు స్వామివారి పాదుకలు, యోగదండం, రుద్రాక్షమాల, అర్ధఖడ్గం, దేరుకోమటి తక్కెడ పుల్లలు ప్రదర్శిస్తారన్నారు. అదేరోజు రాత్రి ఎగువపల్లె గ్రామానికి చెందిన మాచిన నరసయ్యనాయుడు కుటుంబ సభ్యులచే స్వామివారికి మండల పూజ, అన్నదానం, పౌరాణిక నాటకాలు ఉంటాయన్నారు. 22న కాకర్లవారిపల్లె గ్రామస్థులచే చెక్కభజన, కోలాటం, 23న జెట్టివారిపల్లె గ్రామస్థులచే ఆర్కెస్ట్రా, 24న మల్లెంపల్లె గ్రామస్థులచే పౌరాణిక నాటకం, 25న కుమ్మరపల్లె, 26న నగిరిపాడు గ్రామస్థులచే నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 27న బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటకం ఉంటుందన్నారు. ప్రతి రోజు అన్నదానం పూజలు ఉంటాయన్నారు.

'కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం'


మండలాల అధ్యక్షులతో గాజుల భాస్కర్ తదితరులు

రాయచోటిటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షులకు నియామకపు పత్రాలను అందజేశారు. రాజంపేట రూరల్ అధ్యక్షుడిగా తణుకు మహదేవయ్య, రాజంపేట పట్టణ అధ్యక్షుడిగా షేక్. ఆదిల్, టీ. సుండుపల్లెకు షేక్. సైమన్, ఒంటిమిట్టకు సుబ్రహ్మణ్యుడులను నియమించారు.అలాగే రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలికి చల్లా శ్రీనివాస్, పుల్లంపేట సిగమాల రమేశ్, పెనగలూరుకు జీవరత్నం, ఓబులవారిపల్లెకు హరిక్రిష్టారెడ్డిలను, రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రాయచోటి పట్టణ అధ్యక్షుడు బాబాసర్దార్, లక్కిరెడ్డిపల్లెకు అవులకుంట నాగార్జున, రామాపురంకు దేవపట్ల గణేశ్, సంబేపల్లెకు ఉదయగిరి, సుబ్బయ్య చిన్నమండెంకు షబ్బీర్‌ఖాన్‌లను, పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ అధ్యక్షులుగా ఫైరోజ్, వాయల్పాడు బాకా సంబశివ, పీలేరుకు దుబ్బా శ్రీకాంత్‌లను, మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం అధ్యక్షులుగా చిన్నరెడ్డివారి సతీశ్‌రెడ్డి, నిమ్మనపల్లికు కొటికే శేఖర్‌లను, పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి అధ్యక్షుడిగా నందకుమార్‌యాదవ్, పులిచెర్లకు రియాజ్, పుంగనూరుకు మురళీయాదవ్, పుంగనూరుటౌన్‌కు అయాజ్‌బాషా, రొంపిచెర్లకు మునిరాజా, సదుమ్‌కు కదిరప్పలను నియమించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, పుంగనూరు ఇన్‌చార్జి మురళీయాదవ్, పీలేరు ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు ఇన్‌చార్జి గోశాలదేవి, పార్టీ సీనియర్ నాయకులు సింగం రామక్రిష్టారెడ్డి, రాయచోటి చెన్నక్రిష్ణ పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ఘనంగా బోనాలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. గంగమ్మజాతర ముగిసిన అనంతరం రెండవ ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. అధికారులు భక్తులకు చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు ఏర్పాటు చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆలయ ఈఓ అన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు, చెల్లు దినేష్ యాదవ్ ప్రసాదం పంచిపెట్టారు.

మైకు సెట్టు వితరణ

లక్కిరెడ్డిపల్లె గంగమ్మ ఆలయానికి ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైకుసెట్టును మానవతా మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీ నాయక్, ప్రసాదయాదవ్ ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాసులుకు అందజేశారు.

18 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, మార్చి16(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 18 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గంలోని యర్రావారిపాలెం, కేవీపల్లి, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, ఎన్‌పీకుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి 18 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 15 మంది కంటి రోగులకు ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ వైవీ స్వరూపగుప్త, శివప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ చెన్నూరు అన్వర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె మార్గంలో పాత బ్రిడ్జి దెబ్బతింది. సుమారు రూ. 6 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మాణం పనులు 2023 లో మొదలు పెట్టారు. బ్రిడ్జి కప్పు నిర్మాణం గత ఏడాది డిసెంబరులో పూర్తి చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు సుమారు 6 సార్లు కొట్టుకుపోవడంతో అవస్థలు పడ్డామని, బ్రిడ్జి పనులను పూర్తి చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. -రైల్వేకోడూరు(ఆంధ్రజ్యోతి)

బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు అరెస్టు

● రూ. 1,20,000 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం



క్రికెట్ బుకీల అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ ఎస్ఐలు

ప్రొద్దుటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ కేసులో వైసీపీ నాయకుడు రావులకొల్లు నాగేంద్రను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు శ్రీనివాసులు, సంజీవరెడ్డి అరెస్టయిన నలుగురు క్రి కెట్ బుకీల వివరాలు వెల్ల డించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చాంపియన్‌షిప్ ట్రోఫీ సందర్భంగా ఎర్రగుంట్ల రోడ్డు లోని పాలకేంద్ర సెక్యూరిటీ రూం దగ్గర నలుగురు వ్యక్తులు క్రికెట్ బెట్టింగ్ లావాదేవీలు నిర్వ హిస్తుండగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ. 1,20,000 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. అరెస్టు అయిన వారిలో ప్రొద్దుటూరు పట్టణం శ్రీరాం నగర్‌కు చెందిన రావులకొల్లునాగేంద్ర (42), వివేకా నంద కాలనీకి చెందిన గాలిపోతుల ఆనంద్ (21), శ్రీరాంనగర్‌కు చెందిన రావుల కొల్లు మనోజ్ (23), శ్రీరాంనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బొమ్మి శెట్టి శివప్రసాద్ (26) ఉన్నారని తెలిపారు. వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గోవా మద్యం పట్టివేత



ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, మద్యం

ప్రొద్దుటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఇతర ప్రాంతాలనుంచి ప్రొద్దుటూరుకు కారులో గోవా మద్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్ స్పెక్టర్ నీలకంఠేశ్వర రెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సురేంద్రరెడ్డిలు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం జమ్మలమడుగు రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ నందు వాహనాలు తనిఖీ చేస్తుండగా కాటం వీరేంద్ర ఉప్పు రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు కారులో 18 (750ఎంఎల్) గోవా మద్యం ఫుల్ బాటిళ్లను తీసుకోని వస్తుండగా పట్టుబడ్డారు. గోవా మద్యంతోపాటు కారును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

పట్టపగలే భారీ చోరీ

● 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదు అపహరణ



ధ్వంసమైన బీరువా, చెల్లాచెదురుగా దుస్తులు

గుర్రంకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన ఓ కుటుంబం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహ రించుకు వెళ్లారు. బాధితుల కథనం మేరకు మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్ప గారి పల్లెకు చెందిన మునిస్వామి, గంగులమ్మ దంపతులకు వ్యవసాయం జీవనాధారం. వీరి ఇల్లు గ్రామంలో చివరన ఉంది. ఆదివారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లిన వారు సాయంకాలం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటికే ఇంటి ముఖ ద్వారం తెరచి ఉండడంతో, లోనికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసమై, అందులోని దుస్తులు ఇతర సామగ్రి చెల్లాచెదురుగా కింద పడి ఉండడం కనిపించింది. బీరువాలోని లాకర్‌ను పరిశీలించా అందులోని నగలు, బంగారం అపహరణకు గురైనట్లు తేలింది. 150 గ్రాముల బంగారం, రూ.50 వేలు నగదును దుండగులు అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



వెంకటరమణ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్/రామసముద్రం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు చౌడేపల్లె ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. మదనపల్లెలో ఉంటూ మండలంలోని చీకలబైలు హైస్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న వెంకటరమణ(55) ఆదివారం చౌడేపల్లెలో తమ బంధువుల గృహ ప్రవేశానికి వెళ తుండగా చిత్తూరు జిల్లా బోయ కొండ రోడ్డులో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన పడిపోయడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయుడిని స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించార చౌడేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



ఉరి వేసుకున్న లక్ష్మీనారాయణ

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలోని హైపర్‌టెన్షన్ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లాలోని దొనగిరి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ(35) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం రైల్వే కోడూరు మండలం కే. బుడుగుంటపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ని విద్యానగర్‌కు వచ్చాడు. వివిధ రకాల కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమని తెలిసింది. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేణిగుంట రైల్వే పోలీసులు విచారణ చేస్తున్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న మౌలాలి

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. బీకొత్తకోట మండలం, గోళ్లపల్లె గ్రామం, కనికలతోపునకు చెందిన షేక్ మౌలాలి(35) న్యూస్ పేపర్ బాయ్‌గా పని చేస్తుంటాడు. ఆదివారం ఉదయం రోడ్డు పక్కన వెళ తున్న అతను కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు బీకొత్తకోట పోలీసులు తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బాలికల గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుగుణమ్మ తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకుంటే ప్రవేశపరీక్ష ఉంటుందని, ప్రతిభ ఉన్న వారికి సీట్లు లభిస్తాయని తెలిపారు. ఈనెల ఆఖరులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రారంభానికి నోచుకోని భవనాలు

● అసంపూర్తిగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సచివాలయాలు ● ఇధికారులూ స్పందించండి



ముస్తాబైనా మనుగడకు రాని రైతు భరోసా కేంద్రం



ఆకతాయిలు ధ్వంసం చేసిన భవన కిటికీలు

రామసముద్రం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యం కోసం వైసీపీ ప్రభుత్వం మండలాల పరిధిలో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు పూర్తి అయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. అసంపూర్తిగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తున్నాయి. రామసముద్రం మండలంలో మొత్తం 15గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఒక్కో సచివాలయం నిర్మాణానికి సుమారు రూ.15లక్షలు నిధులు కేటాయించింది. మండలంలో చెంబకూరు, కమ్మవారిపల్లె, కాప్పల్లె, పెద్దకురప్పల్లె, రామసముద్రం మండల కేంద్రంలో 2, మినీ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు పూర్తిగా అసంపూర్తిగా ఉన్నాయి. అయితే పూర్తి అయిన మండల కేంద్రంలోని సచివాలయం 2ను వైసీపీ ప్రభుత్వ మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభోత్సవం చేసినా ఇప్పటివరకు అది మనుగడకు నోచుకోలేదు. ప్రస్తుతం ముళబాగల్ రోడ్డులోని ఓ చిన్న చిన్న పాఠశాల భవనంలో సచివాలయం నిర్వహిస్తుండగా, ప్రభుత్వ ఆస్పత్రి భవనంలో రైతు భరోసా కేంద్రం నిర్వహిస్తున్నారు. రామసముద్రం సచివాలయం1ని దిగువపేట మసీదు గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్నారు. మాలేనత్తం సచివాలయం పూర్తి అయినా పురాతన పాఠశాలలో నిర్వహిస్తున్నారు. కాగా సచివాలయం 2కు రైతు భరోసా కేంద్రంలో కొందరు గుర్తు తెలియని ఆకతాయిలు పదిరోజుల కిందట తలుపులు, కిటికీలు, టైల్స్ ధ్వంసం చేశారు. రైతు భరోసా కేంద్ర భవనాలు పూర్తయినా వాటిని వాడుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మందుబాబులకు అడ్డాగా మారుతోందని, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఈభవనంలో అల్లరి మూకలు అసాంఘిక కార్యకలాపాలకు సాగిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని ఉపయోగించుకోకపోవడంతో ప్రజల ధనం వృథా అవుతోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భవనాలు వాడుకలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తలుపుల తాళాలు పగులగొట్టిన ఆకతాయిలు

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప నాగరాజుపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా డీడీయు-జీకేవై పథకం కింద సీడాప్ సౌజన్యంతో 18-32 ఏళ్ల లోపు గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్.సుబ్బరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్, బ్యూటీ థెరపీవంటి కోర్సుల్లో నాలుగు నెలల శిక్షణ, ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పించనున్నామన్నారు. ఈ శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు, ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని, మరిన్ని వివరాలకు 9063082227 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు గ్రీవెన్స్ సెల్

కడప కలెక్టరేట్ మార్చి 16(ఆంధ్రజ్యోతి) ప్రతి సోమవారం ఉదయం 9-30గంటల నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్‌తో పాటు, కలెక్టరేట్ సభా భవన్‌లో ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపాలిటీల స్థాయిలోనిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని తెలిపారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీ

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

కడప సెవెన్ రోడ్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్న మోదీకి ప్రజా ప్రతిఘటన తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అన్నారు. ఆదివారం కడప ఆర్కే నగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సీపీఎం కడప జిల్లా కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ పరమత ద్వేషాన్ని ప్రచారం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఐక్యం చేయడం సీపీఎం భవిష్యత్ కార్యాచరణ అన్నారు. భవిష్యత్తులో దేశంలో, రాష్ట్రంలో జరిగే ఎటువంటి ఎన్నికలలోనైనా సీపీఎం పొత్తులు స్థానిక పరిస్థితుల ఆధారంగా ఉంటాయన్నారు. 2025 ఏప్రిల్ 2వ నుంచి 6వ తేదీ వరకు తమిళనాడులోని మధురైలో నిర్వహించనున్న 24వ సీపీఎం జాతీయ మహాసభల్లో స్పష్టమైన రాజకీయ విధానం రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ, మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



వెంకటరమణ, శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కడప నగరం స్క్వేర్ సమావేశ మందిరంలో ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడుగా రాజంపేట గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సంభావ వెంకట రమణ, కార్యదర్శిగా ముద్దనూరు వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడుగా నాగేశ్వరరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, కోశాధికారిగా అలీ అక్బర్, సంయుక్త కార్యదర్శిగా ఎన్. సంజీవరెడ్డి, రవిశేఖర్‌రెడ్డి మిగిలిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.వెంకటరెడ్డి మాజీ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, పెంచలయ్య, రాజగోపాల్‌రెడ్డి, పోలా రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పి.సురేష్, విజయ్ కుమార్, మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సంజీవ రెడ్డి, నరసింహులు, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు హాజరయ్యారు.

మేమున్నాం.. ఆందోళన విరమించండి

● విద్యార్థులకు ఏపీ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ లక్షుమయ్య సూచన



దీక్షా శిబిరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ లక్షుమయ్య

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పశువైద్య కళాశాల విద్యార్థుల ఉపకార వేతనాలపై ప్రభుత్వంతో మేము పోరాడుతాం. మీరు ఆందోళన విరమించండి అని ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ లక్షుమయ్య (ఐఏఎస్) సూచించారు. ఆదివారం ఆయన ఫోరం ఆఫ్ రిజిస్ట్రార్ టీచర్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డితో కలిసి పశువైద్య కళాశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అతి త్వరలో ఇంటర్న్‌షిప్‌లో అందించే ఉపకార వేతనాల మొత్తం పెంచుతూ ప్రభుత్వం జీవో తీసుకురానుంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తరఫున తాము పోరాడుతామని, విద్యార్థులు ఆందోళన విరమించి తరగతులకు హాజరుకావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న గరివిడి, గన్నవరం, తిరుపతి వెటర్నరీ కళాశాలలోని విద్యార్థులతో మాట్లాడి అందరం కలిసి ఒక నిర్ణయం తీసుకుంటామని విద్యార్థి నాయకులు చెప్పారు. దీంతో లక్షుమయ్య విజయవాడకు బయలుదేరగా, విద్యార్థులు వారి ఆందోళనను కొనసాగిస్తూ, ఇతర కళాశాలలోని విద్యార్థులతో సంప్రదింపులు చేస్తున్నారు.

ముగిసిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

● కడప బాలురు, శ్రీకాకుళం బాలికల విజయఢంకా



పులివెందులలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న కడప, ప్రకాశం జట్లు

పులివెందుల రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు రోజుల పాటు జరిగిన 34వ అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పులివెందులలోని వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరిగిన ఈ పోటీల్లో 13జిల్లాల బాల, బాలికల జట్లు తలపడ్డాయి. చివరి ఫైనల్ మ్యాచ్‌లు ఆదివారం నిర్వహించగా కడప వర్సెస్ ప్రకాశం జట్ల మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో కడప బాలుర జట్టు విజయఢంకా మోగించింది. శ్రీకాకుళం-అనంతపురం మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం బాలికల జట్టు విజయఢంకా మోగింది. విజేతలకు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, కడప జిల్లా అసోసియేషన్ ప్రతినిధుల చేతులమీదుగా కప్‌లు అందించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ట్రెజరర్, కొండయ్య, కోచ్ శ్రీధర్‌లు పాల్గొన్నారు. మొట్టమొదటి సారిగా పులివెందులలో అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలు విజయవంతం అయిన సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

వేడుకగా కనుమలో గంగమ్మ తిరునాళ్లు



ప్రత్యేకాలంకరణలో కనుమలో గంగమ్మ, బోనాలు తీసుకొస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బసినికొండ గ్రామం, పుంగనూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ ఆలయంలో ఆదివారం పగలు తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి వెంకరటమణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు చీర, జాకెట్లు, కుంకుమ, పసుపు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లు కట్టి, కోర్కెలను తీర్చాలని కోరారు. సాయంత్రం ఉట్లోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. మధ్యాహ్నం గుత్తా హరికృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

హిందువుల్లో ఐకమత్యంతో సత్ఫలితాలు

● సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధుల సూచన



సింహాద్రిపురం వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న స్వయంసేవకులు

సింహాద్రిపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో హిందువులంతా ఏకమైతేనే ఫలితం ఉంటుందని సమావేశంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, ముఖ్య అతిథి వెంకటనాథరెడ్డి, ప్రధాన వక్త పుట్టాశేషు అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘం 99 ఏళ్లు పూర్తి చేసుకుని శతవసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆదివారం సాయంత్రం సింహాద్రిపురంలోని జున్ను నారాయణరెడ్డి ఆయిల్ మిల్ నుంచి పుర వీధుల గుండా స్వయం సేవకులు, హిందువులు కవాతు నిర్వహించారు. అంతకంటే ముందు పులివెందుల నుంచి సింహాద్రిపురం వరకు హిందువులు బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల వెంబడి మహిళలు పూలు చల్లి స్వయం సేవకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వక్తలు సమావేశంలో మాట్లాడుతూ స్వయంసేవకులు ఎప్పుడూ క్రమశిక్షణతో దేశం కోసం అంకిత భావంతో పనిచేస్తారన్నారు. సంఘ్ కార్యకర్తలు పర్యావరణ పరిరక్షణ, గోరక్షణ, దేవాలయాల రక్షణ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అత్యంత కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు కూడా పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అజ్జగుట్టు వెంకటనాథరెడ్డి, వంగల శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, విజయరాఘవరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటికి చేరేలోపే కబళించిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రసాద్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

పీలేరు,మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాసేపట్లో ఇంటికి చేరుతాడనుకునేలోపే ఐషర్ లారీ మృత్యువు రూపంలో కబళించింది. పీలేరు పట్టణ శివార్లలోని అప్పర కళాశాల వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందిరమ్మ కాలనీ వాసి ప్రసాద్ (35) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే...

పీలేరు ఇందిరమ్మ కాలనీ వాసి ప్రసాద్, పట్టణంలోని ఎస్వీ మహల్ వద్ద ఉన్న ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పని చేస్తుండేవాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంలో పీలేరుకు వచ్చిన ప్రసాద్ ఇంటికి తిరిగి వెళుతుండగా అప్పర కళాశాల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఐషర్ లారీ ఢీకొంది. దీంతో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ప్రసాద్ భార్య నాగేశ్వరి, తల్లి కృష్ణమ్మ సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మరో రెండు నిమిషాల్లో ఇంటికి తిరిగి వస్తాడు అనుకున్న మనిషి విగత జీవిగా పడి ఉండడం చూసి వారు బోరున విలపించారు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్‌మార్టం మాత్రం నిమిత్తం ప్రసాద్ మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు

ఇరు వర్గాల వివాదం

పులివెందుల టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దారి విషయంలో పట్టణంలో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. స్థానిక జెండామాన్‌వీధిలో ఉన్న పోలేరమ్మ గుడి దగ్గర ఓ ప్రార్థనా మందిరం ఉంది. ఆ వర్గానికి చెందినవారు గుడి వైపు ఉన్న గోడను తొలగించి దారి ఏర్పాటు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు, స్థానికులతో కలిసి వారిని ప్రశ్నించారు. దీంతో ఆ వర్గానికి చెందినవారు భారీగా గుమిగూడడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పట్టణ సీఐ నరసింహులు ఇరు వర్గాలతో మాట్లాడి వివాదాన్ని సర్దు బాటు చేశారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ

వ్యవసాయమే వృత్తి అయితే అద్భుతాలే....

● సమస్యలు చూసి కుంగిపోవద్దు ● అధికారుల సూచనలతో పరిష్కారాలు
● పీలేరులో మామిడి రైతులతో జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర బాబు


సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ రవిచంద్ర బాబు

పీలేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టి అందులోని సవాళ్లను చూసి కుంగిపోకుండా అధికారుల సూచనలు పాటిస్తే అద్భుతాలు సాధించవచ్చని మామిడి రైతులతో జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్ర బాబు తెలిపారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్-2025లో భాగంగా పీలేరు, కేవీపల్లె మండలాల్లోని మామిడి రైతులకు మామిడి పూత, పిందె దశలో సస్యరక్షణ, కవర్ల వినియోగం, మార్కెటింగ్ అంశాలపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చాలా మంది మామిడి రైతులు వ్యవసాయాన్ని పార్ట్ టైంగా భావిస్తుండడం, ప్రతికూల వాతావరణాన్ని చూసి భయపడుతుండడంతో సమస్యలు వస్తున్నాయని అనుకుంటున్నారు. సమస్యలను ఆకళింపు చేసుకుని, అధికారుల సూచనలు పాటిస్తూ తోటల్లో అధిక సమయం గడిపితే మామిడి దిగుబడిలో గణనీయమైన మార్పు సాధించవచ్చన్నారు. ఈ ఏడాది మామిడి రైతులకు వాతావరణం ప్రతికూలంగా మారిందని, అనుభవం, అధికారుల సూచనలు పాటిస్తేనే మంచి దిగుబడి లభిస్తుందని రైతులకు సూచించారు. గతంలో తాము చేసిన అవగాహనతో జిల్లా వ్యాప్తంగా వేయి మంది రైతులు 3800 ఎకరాల మామిడి తోటలకు వాతావరణ ఆధారిత బీమా చేసుకున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 40 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉందన్నారు. కలికిరి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వాతారణ పరిస్థితుల్లో ఆశించే తేనెమంచు పురుగు నివారణకు లీటరు నీటిలో 1 గ్రాము బుప్రోఫూజిన్ 20%, అసి పేట్ 50% లేదా 0.2 గ్రాముల డైనోటోఫ్యూరాన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. 100 మిల్లీల బీఎండబ్ల్యూ షైట్రోబియల్ మందును ఎకరాకు 500 లీటర్ల నీటిలో కలిపి డ్రిప్‌లో వదలాలన్నారు. పిందెలు రాలుతున్నట్లు కనిపిస్తే ఎకరా తోటకు 100 మిల్లీల ప్లానోఫిక్స్ మందును 500 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. తామర పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను చెట్టుకు ఒకటి చొప్పున కట్టి, 7.5 గ్రాముల కానుగ సోప్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలన్నారు. మందులు పిచికారీ చేసినా తామర పురుగుల ఉధృతి కనిపిస్తే 0.3 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్ 5%ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింథటిక్ పైరిత్రోయిడ్స్ మందులను వాడకూడదని హెచ్చరించారు. జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడి కాయలకు కవర్లు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని, కవర్లు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ అధికారి పురుషోత్తం, ఏడీ రమణరావు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు యల్లైల రెడ్డప్ప రెడ్డి, హెచ్‌వో సుకుమార్ రెడ్డి, డీపీఎంసీ సభ్యులు బోదేషావలి, తదితరులు పాల్గొన్నారు.

త్యాగం చిరస్మరణీయం

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి ● నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆర్యవైశ్యులు, పోలీసులు


తంబళ్లపల్లెలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని హెడ్ కానిస్టేబుళ్లు శంకర, సురేష్ కొనియాడారు. పోలీస్ స్టేషన్‌లో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం తన జీవితాన్ని అర్పించిన మహనీయుడని, ఆయన త్యాగం మరువలేనిదన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో...

పీలేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని, తెలుగు జాతి ఔన్నత్యాన్ని కాపాడిన త్యాగమూర్తి అని వక్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం పీలేరులోని పలు ప్రభుత్వ శాఖాధికారులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పీలేరు ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ సభ్యులు స్థానిక సంత గేటు ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. పీలేరు పంచాయతీ కార్యాలయం, ఎంఆర్‌సీలో అధికారులు ఆయన చిత్రపటాలను ఆవిష్కరించి ఆయన సేవలను స్మరించుకున్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎంఈఓలు లోకేశ్వర్ రెడ్డి, పద్మావతమ్మ, ఈఓపీఆర్ ఆర్‌డీ లతీఫ్ ఖాన్, కార్యదర్శి జ్ఞానశేఖర్, సీఆర్‌పీలు మురళీధర్ రాజు, మాధవి, అశోక్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు రేఖూరి సుధీర్, బాలసుబ్రహ్మణ్యం, పామిడి మల్లి కార్జున, ఆమూరి శంకర్‌నాథ్, బండారు ఉమామ హేశ్, కృష్ణమూర్తి, రాచపల్లె కృష్ణ మూర్తి, మురళీ, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో...

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పొట్టిశ్రీరాములు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మదనపల్లె అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలు సైతం త్యాగం చేసిన త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై విహరించిన లక్ష్మీనరసింహస్వామి

పెద్దమండ్యం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పాపేపల్లి కుషావతినది తీరంలో ఏకశిలగుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారు వివిధ రకాల పుష్పాలు, ఆభరణ అలంకరణలో గరుడ వాహనంపై పాపేపల్లి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకంలు వేదపండితులు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పగలు గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు విష్ణుమాచార్యులు, యాజ్ఞకులు రఘునాథాచార్యులు, ఉభయదారులు గుడిశవారిపల్లి రెడ్లు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పాపేపల్లి తిరునాళ్లు

పాపేపల్లి కుషావతినది తీరంలో ఏకశిలగుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం వైభవంగా జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాయిల్‌చెట్ల గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామస్తులు

తంబళ్లపల్లె, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పంచాలమర్రిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో వాయిల్ చెట్ల గంగమ్మ, దండు మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే వేదపండితులు మంత్రోచ్ఛారణలు నడుమ వేద స్వస్తి, నాడీ సంధానం, అవివాహిత అంగహోమం, కళాహోమం, కళాకర్షణన్యాసం, ప్రాణప్రతిష్ఠ, అష్టోతర ద్రవ్య విశేష హోమాలు నిర్వహించారు. ఉదయం 8:35ల నుంచి 9:35ల మధ్య పూర్ణాహుతి, కుంభాభిషేకం, పంచదర్శనం, అలంకరణ, అష్టోత్తర పూజ, మంత్ర పుష్పం, గ్రామిస్య వేద ఆశీర్వచనం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద గ్రామస్తులు అన్నదానం చేశారు.

'పెద్దిరెడ్డి రాజ్యాంగం రూపుమాపాలి'


విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక ప్రణాళికతో టీడీపీ కార్యకర్తలపై దాడి చేయిస్తున్నారని, టీడీపీ కార్యకర్త రామకృష్ణను హత్య చేసింది పెద్దిరెడ్డి అనుచరుడే అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆరోపించారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరుణంలో కృష్ణాపురంలో టీడీపీ నేతలు సంబరాలు చేసుకుంటుంటే పెద్దిరెడ్డి అనుచరులు ద్విచక్రవాహనంపై వచ్చి టీడీపీ కార్యకర్తలను డీకొట్టారన్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు పెద్దిరెడ్డి మాటలు విని కేసులు నమోదు చేయలేదన్నారు. పోలీసులు స్పందించి ఉంటే ఇప్పుడు రామకృష్ణ హత్యకు గురయ్యేవాడు కాదన్నారు. పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే ఇంకా పోలీసు అధికారులు నడుస్తున్నారన్నారు. రామకృష్ణ తనకు ప్రాణహాని వుందని వీడియోలో చెప్పినా పోలీసులు నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు రామకృష్ణ ప్రాణాలు ఎవరు తీసుకొస్తారని ప్రశ్నించారు. రామసముద్రం టీడీపీ మండలాధ్యక్షుడు విజయ గౌడ్ కారును దుండగులు దగ్ధం చేసినా ఇంత వరకు పోలీసులు కేసు దర్యాప్తు వేగం చేయలేదన్నారు. పోలీసులు ఇలా ఉదాసీనతతో వ్యవహరిస్తే టీడీపీ కార్యకర్తలకు రక్షణ కరువవుతుందన్నారు. హోం మంత్రి అనిత పుంగనూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో అక్కడ టీడీపీ కార్యకర్త అనే వాడు వుండడని హెచ్చరించారు.

వైభవంగా ముక్కంటేశ్వరుని తిరునాళ్లు

రామసముద్రం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): నరసాపురంలో వెలసిన ముక్కంటేశ్వర స్వామి తిరునాళ్లు వైభవంగా నిర్వహించారు. మూడురోజులు జరిగిన తిరునాళ్లు శనివారం రాత్రితో ముగిశాయి. ధ్వజస్తంభం వద్ద, ముఖద్వారం వద్ద పూలతో తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బెంగళూరు నుంచి పలురకాల పుష్పాలు తెప్పించి అలంకరణ చేశారు. స్వామి పుష్పపల్లకిని పలు రకాల పుష్పాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి స్వామివారిని పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు చేశారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శనివారం రాత్రి నరసాపురం విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా డీఎస్పీ దర్బార్‌కొండయ్యనాయుడు, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ జి.రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా గుంటిగంగమ్మ ప్రాణప్రతిష్ఠ


ప్రాణప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వాల్మీకిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): చింతపర్తిలో ఆదివారం గుంటి గంగమ్మ తల్లి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయంలో హోమాలు, అభిషేకం, అర్చన, అలంకరణలు గావించి వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేపట్టారు.

దేవళం తండాలో పుష్కలంగా నీరు


దేవళం తండాలో మాట్లాడుతున్న అధికారులు నేతలు

పెద్దమండ్యం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దేవళం తండాలో ఆదివారం తెల్లవారుజామున డ్రిల్లింగ్ చేసి కొత్త బోరులో పుష్కలంగా నీరు పడినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్, జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, యువనేత యుగంధర్ రెడ్డి వెల్లడించారు. 10 రోజులుగా పాత బోరులో తాగునీరు రాలేదని తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి దృష్టికి మండల నేతలు తీసుకెళ్లారు. దీంతో దేవళం తండాలో కొత్త బోరు డ్రిల్లింగ్ వేయంతో నీరు పుష్కలంగా పడ్డాయన్నారు. దిగువపల్లి సర్పంచ్ బండి వాసవి, మాజీ సర్పంచ్ జయమ్మ కార్యదర్శి శివ స్థానిక నేతలు బండి యుగంధర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, గంగాధర, మహేశ్వర, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాల్సిందే..


దుకాణ యజమానులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

వాల్మీకిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాల్సిందేనని ఎస్‌ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద దుకాణాల వద్ద పంచాయతీ స్థలాలు సైతం ఆక్రమించారని దీంతో ఇబ్బందులు తప్పడం లేదని పంచాయతీ అధికారులకు విన్నవించగా రెండురోజుల కిందట పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదు రోజుల కిందట బస్టాండ్ ప్రాంత దుకాణ యజమానులకు నోటీసులు కూడా ఇచ్చారు. సోమవారం పంచాయతీ స్థలాల్లో ఆక్రమణల తొలగింపుపై పంచాయతీ అధికారులు రక్షణ కోరడంతో ఆదివారం ఎస్‌ఐ చంద్రశేఖర్ దుకాణదారులను పిలిపించి చర్చించారు. దుకాణ దారులకు హద్దులకే పరిమితం కావాలని సూచించారు. ఆక్రమితులు స్వచ్ఛందంగా తొలగించకపోతే అధికారులే స్వయంగా తొలగిస్తారని హెచ్చరించారు.

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ


ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలను చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీఎంఎస్ పీలేరు అధ్యక్షుడిగా నాగరాజ


నియామకపత్రం అందుకుంటున్న గుండ్లూరు నాగరాజ

పీలేరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అఖిల భారత మాల సంఘాల (ఏబీఎంఎస్) జేఏసీ పీలేరు మండల అధ్యక్షుడిగా బాలంవారి పల్లె వాసి గుండ్లూరు నాగరాజు నియమితులయ్యారు. పీలేరులో ఆదివారం జరిగిన ఏబీఎంఎస్ జేఏసీ సమావేశంలో పీలేరు శాఖ అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా వి.శివనందన్ ఎన్నిక య్యారు. వారు మాట్లాడుతూ ఏబీఎంఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్, దళితుల హక్కులపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు గుర్రం నారాయణ, నాయకులు నరసింహులు, రామాంజులు, రమేశ్, రామ చంద్రయ్య, లోకార్జున, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కలకడ, మార్చి 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఖాదర్‌వలిని అరెస్టు చేసినట్లు హెచ్‌సీ రమేష్‌బాబు తెలిపారు. కోన వాసి ఖాదర్‌వలి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంపై నిర్వహించిన దాడుల్లో 89 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

వీల్ చైర్ వితరణ

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): టీకే పల్లె వాసి శ్రావణికి ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఆర్మీ శామ్ కోటేశ్వర్ వీల్ చైర్‌ను వితరణగా అందజేశారు. సంస్థ ఫౌండర్ డాక్టర్ స్వాతి మాట్లాడుతూ శ్రావణిని గుర్తించి ఉపాధి కల్పించామన్నారు. కోఆర్డినేటర్ గోవింద్, ఆశాజ్యోతి సభ్యులు రమేష్, మాజీ ఆర్మీ శామ్ కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఐదుగురు పేకాటరాయళ్లను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు అంకిశెట్టిపల్లెలో పేకాటస్థావరాలపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 5,100నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురు జూదర్ల అరెస్టు

పెద్దమండ్యం,మార్చి 16(ఆంధ్రజ్యోతి): పడమటిపల్లె సమీపంలో ఆదివారం. పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు పెద్దమండ్యం ఎస్‌ఐ పీవీ రమణ వెల్లడించారు. జూదర్ల నుంచి రూ. 5500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెల్మెట్ బరువు కాదు - ప్రాణ రక్ష


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నరసింహుడు

ములకలచెరువు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ బరువు కాదని, ప్రాణాలకు రక్షణ ఇస్తుందని ఎస్‌ఐ నరసింహుడు పేర్కొన్నారు. స్థానిక కదిరి రోడ్డులోని షాదీమహల్ వద్ద ఆదివారం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావదన్నారు.

రామకృష్ణ కుటుంబానికి అండగా చంద్రబాబు : ఎమ్మెల్యే


రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత చేతిలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి టీడీపీ అధిష్ఠానం, సీఎం చంద్రబాబునాయుడు అండగా వుంటారని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పించిన ఆయన రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ బలోపేతానికి రామకృష్ణ పడిన కష్టం విలువ ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

రామసముద్రం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దిగువపేటలో వెలసిన పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన ఆదివారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి ఉత్సవ మూర్తులను పల్లకిపై పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇసుక తవ్వితే కేసులు


రిజర్వాయర్ వద్ద సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

వాల్మీకిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బోగంపల్లె రిజర్వాయర్ వద్ద ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్ హెచ్చరించారు. శనివారం రాత్రి రిజర్వాయర్ వద్ద ఇసుక తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఈఓ మాట్లాడుతూ పట్టణానికి తాగునీటి సరఫరా చేసే రిజర్వాయర్ ప్రాంతంలోని బోరుబావుల వద్ద ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నారని ఇకపై ఉపేక్షించబోమన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతుంటే ఇసుక అక్రమ తవ్వకాలతో రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య కూడా వస్తుందని రిజర్వాయర్ ప్రాంతంలో నిఘా పెట్టి ఇసుక తవ్వకాలను అడ్డుకోనున్నట్లు చెప్పారు.

రేపు చేపల చెరువు వేలం

ములకలచెరువు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మద్దినాయనిపల్లె పంచాయతీ బాట్నాయనిచెరువులో చేపల పెంపకానికి వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ మోహన్‌ప్రతాప్, సర్పంచ్ కృష్ణమూర్తి తెలిపారు. మద్దినాయనిపల్లె పంచాయతీ కార్యాలయం లో జరిగే వేలం పాటల్లో పాల్గొనే వారు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

మదనపల్లె అర్బన్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఒత్తిడి లేకుండా రాయాలని మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ 22 పరీక్ష కేంద్రాల్లో 4380మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. సోమవారం నుంచి ఏప్రిల్ 1 వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయన్నారు. మదనపల్లె పట్టణం, మండలం పరిధిలో 18 కేంద్రాల్లో 3,330 మంది, నిమ్మనపల్లె మండలంలో ఒక కేంద్రంలో 340 మంది, రామసముద్రంలో మూడు కేంద్రాల్లో 510 మంది పరీక్షలు రాస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. కేంద్రాలను ఇన్విజిలేటర్లను, కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, పీహెచ్‌సీల నుంచి నర్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

వాల్మీకిపురం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. స్థానిక వీపీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ఉర్దూ హైస్కూల్, మండలంలోని చింతపర్తి జడ్పీ హైస్కూల్ కేంద్రాలుగా మొత్తం 471మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ వెంకటరత్నం తెలిపారు. విద్యార్థుల సౌకర్యాల ఏర్పాటుపై అధికారులు పర్యవేక్షించారు.

ములకలచెరువులో నాలుగు కేంద్రాలు

ములకలచెరువు/నిమ్మనపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వెంకటరమణ తెలిపారు. ములకలచెరువు జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, బురకాయలకోట జడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాల కేంద్రాల్లో మొత్తం 790 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని చెప్పారు. పరీక్షా కేంద్రాలకు గంటముందే రావాలన్నారు.

నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్‌లో టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. నిమ్మనపల్లి (తెలుగు) పాఠశాలలో 328మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

రామసముద్రంలో మూడు కేంద్రాలు

రామసముద్రం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో టెన్త్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. మండలంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 210మంది, మండల కేంద్రంలో 200మంది, కేజీబీవీ పరీక్ష కేంద్రంలో 100మంది, మొత్తం 510మంది పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

పీటీఎం మండలంలో 263 మంది...

పెద్దతిప్పసముద్రం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 263 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తున్నట్లు ఎంఈఓ నారాయణ పేర్కొన్నారు. కమ్మచెరువు, కందుకూరు, పీటీఎం (తెలుగు), పీటీఎం (ఉర్దూ), కస్తూర్బా, మోడల్ స్కూల్ విద్యార్థులు స్థానిక మోడల్ స్కూల్‌లో పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పులికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొలకలచెరువు, రంగసముద్రం, బూర్లపల్లె, టి.సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు బి.కొత్తకోటలోని వివిధ సెంటర్లలో పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పెద్దమండ్యం మండలంలో 425 మంది

పెద్దమండ్యం,మార్చి 16(ఆంధ్రజ్యోతి): మండలంలో 425 మంది పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. వారు మాట్లాడుతూ పెద్దమండ్యం, కలిచెర్ల హైస్కూల్ రెండు పరీక్ష కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ విద్యా సంవత్సరం మండలంలో 425 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. కలిచెర్ల ఉర్దూ హైస్కూల్‌లో మొదటి బ్యాచ్‌గా 34 మంది విద్యార్థులు పరీఓలు రాయనున్నారు. 25 మంది బాలికలు, 9మంది బాలురు ఉన్నట్లు తెలిపారు.